# మరో 'విజయ విలాసం'

వాలు మీలు డాలు నేలింతి కన్గవ
సోము గోము నోము రామ మోము
మిందు మించు సతిచు మించు బాలిక
మిన్ను చెన్ను తన్ను కన్నె నడుము....

ఈ పద్యం వినిపిస్తే - ప్రబంధ కవిత్వంతో అంతో ఇంతో పరిచయ్గ ఉన్నవాళ్ళు చప్పున ఇది 'విజయ విలాసం' పద్యమనేస్తారు.

నిజానికి ఇది విజయ విలాసంలోని పద్యమే అయితే 'చేమకూర' విజయ విలాసం కాదు. గణపవరపు వేంకట కవి 'ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసం' —

ప్రబంధాల్లో ఆశుచిత్ర విస్తర వర్ణన అనే చిత్ర కవిత్వం ఎక్కడో ఒకచోట చెప్పడం మన ప్రబంధ కవుల నియమం. కానీ అంతా చిత్ర కవిత్వమే చెప్పిన ఏకైక ప్రబంధం "ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసం" ఎక్కడో ఒకచోట అలాటి పద్యం వుంటేనే దాన్ని ప్రతిపదార్థంగా వివరిస్తే తప్ప సులువుగా అర్థం కాదు. అలాంటిది గ్రంధానికి గ్రంథమే మొత్తం అలావుంటే ఇక చెప్పేదేముంది.

మీలు అంటే మీనులు - వాలు మీలు అంటే వాలు కన్నులున్న చేపలు ఆడవాళ్ళను మీన నేత్రలు అంటారు. చేప ఆకారంలో వుండి జింక కళ్ళలా - చేపకదలికతో మెరిసే విరిసే కనులున్న అమ్మాయిని మీన నేత్ర అంటారు. ఆ ఇంతి కనుగవ - రెండు కళ్ళు - వాలు కనుల చేప డాలు = అందాన్ని ఏలుతుందట - అంటే చేప కనులతో పోలిక కాదు - దాన్ని మించి వున్నాయనీ అర్థం —

సోము అంటే చంద్రునియొక్క - గోము అంటే అంద చందాలు ఓమదమంటే జయించడం రామ అంటే అందగత్తె ఆ అందగత్తె ముఖ చంద్రుడు చంద్రుని అందచందాలను జయించేలా వున్నాడట—

మించు అంటే మెరుపు తీగె మించు మించు అంటే ఆ మెరుపుల్లో మెరిసే మెరుపు. దాని సంచు అంటే అందము. ఆ బాలిక మేను. మెరుపు తీగల్లో మెరుపు తీగ అందాన్ని మించుతుందట - ఆడవాళ్ళ శరీరాన్ని మెరుపు తీగతో పోల్చడం కవి సమయం. అయితే ఈ బాలిక శరీరం మెరపు తీగల్లో మెరుపు తీగ అందాన్ని మించి పోతున్నదట.

మిన్ను అంటే ఆకాశం. ఆకాశం గగనం శూన్యం అని ... అది ప్రోది చేసుకుని ఆకాశం అంటే శూన్యం అని అర్థాన్ని లాగారు. చెన్ను అంటే అందం. నడుమును గగనంతో పోలుస్తారు. ఆకాశం కంటికి కన్పిస్తుంది. కానీ నిజానికి అది శూన్యం లేదు. కాబట్టి ఉండీ లేనట్టు, లేనట్టుండే లేలేత నడుమును గగనంతో ఉపమించడం కవి సంప్రదాయం. అయితే ఈ కన్నె నడుము ఆ ఆకాశం ఉనికినే ప్రశ్నిస్తోన్నట్టుగా వుందట —

ఒక తేలిక పద్యంలోనే ఇంత కసరత్తు చూపిస్తే కొంచెం కఠినమైన పద్యంలో ఎలా మీతి మిరేడో చుద్దాం.

నిను నెమ్మనమున నమ్మిన
ననుమానము మానమానవని నేమమునన్

మనసీ నామము నూనెన్నను
మానిక నిన్ను మాననానే మేనా

ఇది నిఘంటువును దగ్గర పెట్టుకొని చీల్చి చెండాడితే కానీ అర్థం దొరకని పద్యం. దీని తాత పద్యం మరొకటి....

లోలాళి లాలి లీలా ళిలా లీ లాల లేల లేలిలు లలులే
లోలులై లాలలల ల్లీ లైలల లాలలోల లేలో లేలా....

ఇవన్నీ పండిత ప్రకాండులు వలచి ఒలచి చేతిలో పెడితే మనం "రాపీగా" ఆస్వాదించదగ్గ ఇనుపగుగ్గిళ్ళు— ఊహల నారికేళాలు. మన్నించండి నాళికేరాలు—

విజయ విలాసం అన్నందుకు— అలాంటి పద్యాలు కోకొల్లలు.

హరిపదము బోలుజవరాలి గౌనుకౌను
మిక్కుటద్దములను గొమరెక్కు చెక్కు చెక్కు
గులుకు దేటుల కింతి ముంగురులు గురులు
గరిమ నెలకన్న కన్నె జఘనము ఘనము

ఇలా శబ్దాశ్రయ శ్లేషచమత్కారం కొంచెమే నిజానికి ఇందులో పాండితీప్రౌఢిమ అంతా ఛందస్సం భంది. ఇదొక చిత్ర బంధ కవిత్వ సరసి.

బంధ కవిత్వంలో గోమూత్రికా బంధంలాటిని చాలా మంది కవులు చేసిన చిత్రాతే— అలాగే ఒక పద్యంలో రెండో మూడో పద్యాలు లాగడం కూడా చాలా మంది చేసిన పరిశ్రమే. అయితే ఇందులో ఒక సీసంలో 41 వృత్తాలు ఇమడ్చడం— నభూతో నభవిష్యతి అనేలా చేసింది మాత్రం గణప వరం వేంకట కవే ! (808) పద్యం) పద్యాలకు కందమనో సీసమనో చంపక మాలనో పేరుంటుంది. ఉదా— శ్లోకగర్భిత చంపకమాలిక— అందే చంపక మాల పద్యంలో శ్లోకం వుంటుంది (822)—అయితే 41 వృత్తాలను ఇముడ్చు కున్న ఆ పద్యం పేరే ఒక పెద్ద వచనంలా వుంటుంది—

ఇలాటి కఠిన క్రీడలే కాక 'తేలికయిన ఆటలు" కూడా పద్యాలతో ఆడుకున్నాడు వేంకట కవి— సంవత్సర యుక్త సీసంలో శ్రీముఖి ప్రభవ— సౌమ్య — భావ మొదలయిన సంవత్సరాల పేర్లతో పద్యం కట్టాడు కవి (389) — సర్వలఘువచనం (383)తో పాటు, సర్వగురువచనం. కూడా వుంది (447) అచ్చ తెనుగు పచ్చలూ ఇందులో పొదిగి పోషించాడు కవి.

ఇలాటి కారచమత్కారాలేకాదు చక్కని కవిత్వం కూడా చెప్పాడు కవి.

యామినీ సరస్వతి

ఏటికి నన్నె దుర్మాన వదేటికి కౌగిటగ్రుచ్చి చేరవిం
తేటికి విన్న నయ్యెద వదేటికి చూచెదుఱిత్తచూపులన్
మాటిలి వెందు రీకులుకు మాటలు నీనగుమోము తేటలో
పాటలొ పాటలాధర కృపన్ గనుమా యనుమాన మేటికిన్

ఒక కవి ఆజీవితం కృషి చేస్తేనే ఇలాటి ప్రబంధాన్ని సృష్టించగలడు. అల్లాంటి గ్రంధాన్ని పఠించాలంటే ఎంతో తీరిక ఓపిక అవసరం. ముద్రణా పుణ్యం కట్టుకున్నది ఆంధ్రప్రదేశ్ సాహిత అకాడమి. ఇప్పుడు తెలుగు విశ్వవిద్యాలయం పనిగట్టుకుని పూనుకుంటే ఎవరైనా "తాపీ"గా కృషిచేస్తే ఈ 'విజయ విలాసం' కూడా 'ఆంధ్రావళి ఆమోదం' పడయగలద్దు. ఎవరో ఆ పుణ్యాత్ములు? ఎప్పుడో ఆ బంగారు కాలం?

—o—